# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

మంగళవారం 16, జూన్ 2026



### కాంగ్రెస్ పార్టీ అవినీతి కారణంగానే..

# సింగరేణి సంస్థకు నష్టం

**కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 15, ప్రభాతవార్త :**

కాంగ్రెస్ పార్టీ అవినీతి కారణంగానే సింగరేణి సంస్థకు నష్టం వాటిల్లుతుందని సోమవారం బాయిబాట కార్యక్రమంలో టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత ధ్వజమెత్తారు. మంచిర్యాల గడ్డమీది నుండే తెలంగాణ రాష్ట్రసేన రాజకీయం చేస్తుందని ఆమె అన్నారు. కాసిపేట 1 ఇంక్లైన్ గనివద్ద కార్మికులతో గేట్ సమావేశంలో మాట్లాడుతూ పాలసీలు చేయాల్సిన సీఎం, డిప్యూటీ సీఎంలే వినతిపత్రాలు ఇస్తూ సింగరేణి కార్మికులను మభ్యపెడుతున్నారని, డిపెండెంట్ ఉద్యోగాలతో సహా అన్నింటిలో కార్మికులకు అన్యాయం చేస్తున్నారని, సింగరేణిలో మెడికల్ బోర్డు పెట్టక పోతే హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌ను గతంలో ముట్టడించినట్లు పేర్కొన్నారు. సింగరేణికి బొగ్గుబావులు తెచ్చుకుంటే దాదాపు లక్ష ఉద్యోగాలు ఇవ్వవచ్చని కానీ అండర్‌గ్రౌండ్ గనులను రద్దు చేయాలని ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఆమె ఆరోపించారు. కార్మికుల కోసం హెచ్ఎంఎస్‌తో కలిసి టీఆర్ఎస్ పోరాటం చేస్తుందని ఆమె కార్మికులకు భరోసా కల్పించారు. రానున్న ఏ ఎన్నికలలో నైనా హెచ్ఎంఎస్‌తో కలిసి టీఆర్ఎస్ సంయుక్తంగా పోరాడుతుందని అన్నారు. మనకు ఢిల్లీ స్థాయిలో పనులు కావాలంటే జేబీసీసీలో రియాజ్ హైమద్ సభ్యునిగా ఉండటం గర్వకారణమని తెలిపారు. సింగరేణి కార్మికుల దీవెనల కోసం ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు ఆమె అన్నారు. అనంతరం మంచిర్యాల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ మంచిర్యాల ఎమ్మెల్యే గుండాగిరి మిగతా 2లో..

- కిషన్‌రెడ్డి ఈ భూమి పుత్రుడైతే సింగరేణికి మేలు చేయాలి
- గుంటనక్క మాయలో కిషన్‌రెడ్డి పడ్డారు
- ఆయన లేఖ రాస్తే... ఈయన ఆరా తీస్తారు
- మంచిర్యాల గడ్డమీది నుంచే తెలంగాణ రక్షణ సేన రాజకీయం
- కార్మికులకు హెచ్ఎంఎస్, టీఆర్ఎస్ అండగా ఉంటుంది
- బొగ్గుబాయి కార్యక్రమంలో భాగంగా టీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల కవిత




### ప్రజావాణి దరఖాస్తులు

# సత్వరమే పరిష్కరించాలి

**ఆసిఫాబాద్, జూన్ 15, ప్రభాతవార్త :**

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టర్ రెడ్డి భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణులతో కలిసి అర్జిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. కౌటాల మండలం మొగడ్ దగడ్ గ్రామానికి చెందిన చంద్రి మడిరాం తనకు వృద్ధాప్య పింఛన్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. రెబ్బెన మండలం నవేగాం గ్రామానికి చెందిన మహాత్మ శకుంతల తనకు రైతు బీమా డబ్బులు మంజూరు చేయాలని, కాగజ్ నగర్ పట్టణం పోచమ్మ బస్తీకి చెందిన బత్తుల రాజేశ్వర్ దివ్యాంగుడు అయిన ఎలక్ట్రిక్ ట్రై సైకిల్ అందజేయాలని, దహేగాం మండలం ఐనం గ్రామానికి చెందిన కెల్లూరి దుర్గా గౌడ్ తనకు ప్రభుత్వం ఇచ్చిన లావుని పట్టా భూమిని అటవీ శాఖ సిబ్బంది అడ్డుపడుతున్నారని, తనకు న్యాయం చేయాలని, మిగతా 2లో..



# అర్ధరాత్రి హోటల్‌లో భారీ అగ్నిప్రమాదం

* 20 లక్షల ఆస్తి నష్టం * హోటల్‌లో మంటలు గంటల పాటు శ్రమించి అదుపులోకి తెచ్చిన అగ్నిమాపక సిబ్బంది

**మంచిర్యాల, జూన్ 15, ప్రభాతవార్త**

హోటల్‌లో సోమవారం తెల్లవారుజామున జరిగిన అగ్నిప్రమాదం తీవ్ర కలకలం రేపింది. రాత్రి సుమారు 2 గంటల సమయంలో హోటల్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి మిగతా 2లో..



### శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై


# కఠిన చర్యలు తీసుకోవాలి

☆ కాగజ్‌నగర్ రూరల్ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ నితికా పంత్

☆ విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని పోలీసు సిబ్బందికి సూచన

**కాగజ్‌నగర్ రూరల్, జూన్ 15, ప్రభాతవార్త :**

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితికా పంత్ ఐపీఎస్ సోమవారం కాగజ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి సమగ్ర తనిఖీ నిర్వహించారు. స్టేషన్ పరిసరాలు, లాకప్ గది, రిసెప్షన్, బెల్ ఆఫ్ ఆర్మ్స్ రూమ్, స్టోర్ రూమ్, వివిధ రికార్డులు, పెండింగ్ కేసుల పురోగతి, హాజరు రిజిస్టర్, స్టేషన్ పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ నితికా పంత్ ఎస్సై సందీప్ కుమార్‌తో పాటు పోలీసు సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో చట్టవ్యతిరేక కార్యకలాపాలు, అసాంఘిక చర్యలు, అక్రమ రవాణా, మిగతా 2లో..



## కాంగ్రెస్ పార్టీ అవినీతి కారణంగానే..

# సింగరేణి సంస్థకు నష్టం

(మొదటిపేజీ తరువాయి)

బంద్ చేయాలని ఆమె హెచ్చరించారు. ఈ ప్రాంత ప్రజల ప్రేమను పొంది అన్ని చోట్ల టీఆర్ఎస్ జెండా ఎగరవేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. గుంటనక్క మాయలో కిషన్ రెడ్డి పడ్డట్లు, ఆయన లేఖ రాయగానే ఈయన ఆరా తీస్తారని ధ్వజమెత్తారు. మేము సింగరేణికి వెళ్తున్నామని తెలిసే గుంటనక్క అక్కడికి వచ్చినట్లు ఆమె అన్నారు. జీఎం చేసే పనులను సీఎం, క్లర్క్ చేసే పనులను డిప్యూటీ సీఎం చేస్తున్నట్లు ఆమె విమర్శించారు. కేంద్రం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను టీఆర్ఎస్ వ్యతిరేకిస్తుందని ఆమె తెలిపారు. కిషన్‌రెడ్డి ఈ భూమి పుత్రుడు అయితే సింగరేణికి మేలు చేయాలని ఆమె అన్నారు. క్లర్క్ పోస్టులకు 9 నెలల క్రితం నోటిఫికేషన్ వేసి ఇప్పటికి కూడా పరీక్ష పెట్టలేదని ఆమె అన్నారు. టీఆర్ఎస్ అధికారంలోకి వస్తే యువతకు 2 లక్షల నుండి 20 కోట్ల వరకు రుణాలు ఇచ్చి సింగరేణిలో యంత్రాలను మరమ్మత్తు చేసే పరిశ్రమ పెట్టుకునేలా కృషిచేస్తామని అన్నారు. రాజస్తాన్‌లో నష్టాల్లో ఉన్న సంస్థలో కలిసి సోలార్ ప్లాంట్ పెట్టడం ఎంత వరకు సమంజసమని ఆమె అన్నారు. ఈ ఒప్పందాన్ని వెంటనే విరమించుకోవాలని ఆమె సూచించారు. గతంలో డిజిల్ కుంభకోణం గురించి పలుమార్లు చెప్పినప్పటికి కూడా చర్యలు చేపట్టలేదు. కాంట్రాక్టు కార్మికులకు న్యాయం చేయాలని స్థానిక ఎంపీ చొరవచూపాలని అన్నారు. సింగరేణి ప్రాంతంలో ప్రజలు ఏకపక్షంగా కాంగ్రెస్‌ను గెలిపిస్తే కానీ కాంగ్రెస్ మాత్రం వారికి మేలు చేయలేదని అన్నారు. లాభాల వాటాలో అత్యధిక శాతం చూపి తక్కువ మొత్తంలో కార్మికులకు లాభాలు చెల్లించినట్లు కానీ ఈ సారి లాభాలా వాటను ఇంతశాతం ఇవ్వాలని నిబంధన లేకుండా గతంలో చెల్లించిన లాభాల వాటాకు ఈ సారి చెల్లించే లాభాల వాటాలో రూ. 10 వేలు ఎక్కువగా కలిపి చెల్లించాలని ఆమె తెలిపారు. అనంతరం బెల్లంపల్లిలో ర్యాలీగా బయల్దేరి పార్టీ జెండాను ఆవిష్కరించడం జరిగింది. అనంతరం రాష్ట్రంలోనే తొలి పార్టీ కార్యాలయాన్ని ఆసిఫాబాద్‌లో ప్రారంభించినట్లు తెలిపారు. స్థానిక రైతుల సమస్యలపై మాట్లాడుతూ యూరియా యాప్‌ను వెంటనే రద్దు చేయాలని, ఎకరాకూ 3 బస్తాల యూరియా అందించాలని ఆమె డిమాండ్ చేశారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, పోడు సాగు చేసుకుంటున్న గిరిజన రైతులకు పట్టా ఇవ్వాలని ఆమె అన్నారు. అనంతరం ఇంద్రవెల్లి అమరవీరుల స్థూపానికి నివాళులర్పించి అమరవీరుల త్యాగం మరువలేనిదని పోరాటాల స్ఫూర్తింకి ఇంద్రవెల్లి నిదర్శనమని ఈ స్ఫూర్తితోనే పార్టీని ముందుకు తీసుకెళ్లడం జరుగుతుందని ఆమె అన్నారు. టీఆర్ఎస్ అధికారంలోకి వస్తే ఆదివాసులకు ప్రత్యేక స్థానం ఉంటుందని అన్నారు. ఆదివాసుల ఆరాధ్యదైవమైన నాగోబా తను ఎంతో దైవంగా భావించి దర్శించుకుంటానని తెలుపడం జరిగింది. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్, జెబిసీసీఐ మెంబర్ రియాజ్ హైమద్, మాజీ మంత్రి బోడ జనార్ధన్, మందమర్రి ఏరియా హెచ్ఎంఎస్ అధ్యక్షులు సాజన్, హెచ్ఎంఎస్ సంఘం వివిధ నాయకులు, టీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## వర్షాకాలంలో విద్యుత్ పట్ల వినియోగదారులు జాగ్రత్తగా ఉండాలి

**ఆసిఫాబాద్, జూన్ 15, ప్రభాతవార్త :**

వర్షాకాల నేపథ్యంలో విద్యుత్ వాడకం పట్ల వినియోగదారులు జాగ్రత్తగా ఉండాలని ఆ శాఖ ఎస్ఈ జాడే ఉత్తమ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్కడైనా విద్యుత్ తీగలు తెగిపడి కనిపించినా, స్తంభాలు ఒరిగిపోయినా, ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకర స్థితిలో ఉన్నా, వెంటనే సమీప విద్యుత్ అధికారులు, విద్యుత్ అత్యవసర సేవల టోల్ ఫ్రీ నంబర్ 1912కు సమాచారం అందించాలని కోరారు. అదేవిధంగా ఎమర్జెన్సీ రీస్టోరేషన్ టీమ్ వాహనాల ద్వారా హఠాత్తుగా సంభవించే సమస్యలను పరిష్కరించడంలో దోహదపడుతూన్నాయని సబ్‌డివిజన్ స్థాయిలో వాహనాలను సిద్ధంగా ఉంచి అత్యవసర పరిస్థితుల్లో వినియోగిస్తున్నామని పేర్కొన్నారు. ఈ వాహనాల్లో విద్యుత్ లైన్ల మరమ్మత్తులకు అవసరమైన కండక్టర్లు, ఇన్సులేటర్లు, కేబుల్స్, టూల్స్ తదితర మెటీరియల్ ముందుగానే అందుబాటులో ఏర్పాటు చేసుకొని , వాహనాలకు జీపీఆర్ఎస్ ఏర్పాటు చేయడంతో సమస్య ఏర్పడిన ప్రాంతానికి బృందాన్ని వెంటనే పంపించి వేగంగా సమస్యలను పరిష్కరిస్తున్నామని ఎస్ఈ వివరించారు.

# వ్యవసాయంలో పంటల మార్పిడితో అధిక లాభాలు సాధించాలి

**- సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు - జల్ జీవిక ఆధ్వర్యంలో కార్యక్రమం**

**- రైతులకు వరి, కంది విత్తనాలు పంపిణీ**

**కాగజ్‌నగర్ రూరల్, జూన్ 15, ప్రభాతవార్త :**

రైతులు సంప్రదాయ పంటలతో పాటు పంటల మార్పిడి విధానాన్ని అనుసరించి అంతర పంటలు సాగు చేయడం ద్వారా అధిక ఆదాయం పొందవచ్చని సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు అన్నారు. మండలంలోని వంజిరి గ్రామ రైతు వేదికలో జల్ జీవిక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన నాణ్యమైన విత్తనాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు బయో ఫోర్టిఫైడ్ వరి, కంది విత్తనాలను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడం ద్వారా దిగుబడులు పెరగడంతో పాటు వ్యవసాయంలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని, రైతులందరూ అందుబాటులో ఉన్న వ్యవసాయ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ ఏడాది కౌటాల, కాగజ్‌నగర్ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా లక్ష బస్తాలకు పైగా మక్కజొన్న కొనుగోలు చేయడం వల్ల రైతులకు మంచి ధర లభించిందని పేర్కొన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని, వ్యవసాయ రంగాభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యేను జల్ జీవిక ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జల్ జీవిక స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పద్మాకర్ గర్, ఏడీఏ మనోహర్, వ్యవసాయ అధికారి రామకృష్ణ, సర్పంచ్ గౌత్రే లక్ష్మి, ఉపసర్పంచ్ డోంగ్రే భరత్, పీఏసీఎస్ చైర్మన్ ఉమామహేశ్వరరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు




## ప్రజావాణి దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి

(మొదటిపేజీ తరువాయి)

దహేగం మండలం ఐనం గ్రామ సర్పంచ్ ఎల్ముల్లే ప్రశాంత్ తమ గ్రామంలో విద్యుత్ స్తంభాలు వంగి ఉన్నందున సరి చయాలని, రెబ్బెన మండలం కైరుగాం పంచాయతీ పరిధిలో ఎడవెల్లి గ్రామానికి చెందిన రైతులు తమ పంట పొలాలకు వట్టివాగు నీరు అందించాలని, కౌటాల మండలం బాలేపల్లికి చెందిన సాయి ప్రసాద్ తనకు 8వ తరగతిలో గురుకుల పాఠశాలలో సీటు ఇప్పించాలని, దహేగాం మండలం కోతిమీర్ గ్రామానికి చెందిన రెడ్డి రాజయ్య తనకు బ్యాంకు నుండి రుణం ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని పెండింగ్ లో లేకుండా పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

## అర్ధరాత్రి హోటల్‌లో భారీ అగ్నిప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

తీసుకొచ్చారు.ప్రాథమిక సమాచారం ప్రకారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ అగ్ని ప్రమాదం సంభవించినట్లు తెలుస్తోంది. మంటలు వేగంగా వ్యాపించడంతో హోటల్‌లోని ఫర్నిచర్, విద్యుత్ పరికరాలు, వంట సామాగ్రి తదితర వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి.ఈ ఘటనలో సుమారు రూ.20 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించినట్లు హోటల్ యాజమాన్యం అంచనా వేస్తోంది. అయితే ప్రమాదం జరిగిన సమయంలో హోటల్‌లో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం ఊరటనిచ్చింది.ఘటనపై పోలీసులు, అగ్నిమాపక శాఖ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అగ్ని ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలపై అధికారులు విచారణ కొనసాగిస్తున్నారు.

## శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

మాదకద్రవ్యాల విక్రయాలు, వినియోగంపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులు, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యలను సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళలు, బాలికల భద్రతకు సంబంధించిన కేసుల విచారణలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. రాత్రి వేళల్లో పికెటింగ్, ప్యాట్రోలింగ్, పర్యవేక్షణను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.ప్రజల భద్రతకు విఘాతం కలిగించే వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, నేర నియంత్రణలో ఎలాంటి నిరక్ష్యం ప్రదర్శించవద్దని ఎస్పీ స్పష్టం చేశారు. ఈ తనిఖీ కాగజ్‌నగర్ డీఎస్పీ వహిదుద్దీన్ పాల్గొన్నారు.

## ఉద్యోగ దరఖాస్తు ఫీజు తగ్గించాలి

**- నిరుద్యోగులపై అదనపు భారం మోపొద్దు**

**- బీసీ సమాజ్ నేత నరెడ్ల శ్రీనివాస్**

మంచిర్యాల, జూన్ 15 ప్రభాతవార్త



తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్లకు దరఖాస్తు ఫీజును భారీగా పెంచిన నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, గతంలో సుమారు రూ. 200గా ఉన్న దరఖాస్తు ఫీజును ఏకంగా రూ. 1000కు పెంచడం నిరుద్యోగ యువతపై అదనపు ఆర్థిక భారం మోపినట్లేనని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో పోటీ పరీక్షలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల నుంచి ఒక్క పైసా కూడా తీసుకోబోమని హామీ ఇచ్చిన ప్రభుత్వం, ఇప్పుడు అధిక ఫీజులు విధించడం ద్వారా నిరుద్యోగ యువతను నిరాశకు గురిచేస్తోందని విమర్శించారు. ప్రస్తుతం వేలాది మంది నిరుద్యోగ యువకులు హాస్టళ్లు, అద్దె గదుల్లో ఉంటూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారని, కుటుంబాలపై ఆధారపడి లేదా అప్పులు చేసి చదువుకుంటున్న వారికి ఈ ఫీజుల పెంపు మరింత భారంగా మారిందని తెలిపారు. ఒకే అభ్యర్థి అనేక ఉద్యోగ నోటిఫికేషన్లకు దరఖాస్తు చేసుకోవాల్సిన పరిస్థితి ఉన్నందున ప్రతి దరఖాస్తుకు రూ. 1000 చొప్పున చెల్లించడం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందని అన్నారు. నిరుద్యోగుల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే పెంచిన జాబ్ అప్లికేషన్ ఫీజును తగ్గించాలని, యువతకు అనుకూలమైన విధానాలను అమలు చేయాలని నరెడ్ల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు.

# సింగరేణి కార్మికుల హక్కులు కాపాడేందుకు బొగ్గుబాయి యాత్ర

## మంచిర్యాల నుంచి తెలంగాణ రక్షణ సేన రాజకీయం ప్రారంభం - తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కవిత

**మంచిర్యాల, జూన్ 15, ప్రభాతవార్త**



సింగరేణి కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం తెలంగాణ రక్షణ సేన నిరంతరం పోరాడుతుందని ఆ పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. బొగ్గుబాయి యాత్రలో భాగంగా సోమవారం మంచిర్యాలలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆమె మాట్లాడారు. మంచిర్యాల నుంచే బొగ్గుబాయి యాత్ర ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు, రైతులు, సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తెలంగాణ రక్షణ సేనను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం సింగరేణిలో ఓపెన్‌కాస్ట్ మైనింగ్ పేరుతో కార్మికుల సంఖ్యను తగ్గించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. అండర్‌గ్రౌండ్ మైనింగ్‌కు ప్రాధాన్యం ఇస్తే ఎక్కువ బొగ్గు ఉత్పత్తితో పాటు తెలంగాణ యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. సింగరేణి కార్మికులకు కనీస సౌకర్యాలు కూడా కల్పించకుండా వేధింపులకు గురి చేస్తున్నారని, అధికారులు, కార్మికుల మధ్య వివక్ష చూపుతున్నారని విమర్శించారు. సింగరేణికి ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తెలంగాణ రక్షణ సేన తీవ్రంగా వ్యతిరేకిస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వాటిని అమలు చేయబోమని అసెంబ్లీలో తీర్మానం చేయాలని కోరారు. తెలంగాణకు మరిన్ని బొగ్గు బ్లాకులు కేటాయించేందుకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చొరవ తీసుకోవాలని సూచించారు. సింగరేణి కార్మికులకు ఆదాయపు పన్ను మినహాయింపు, పెన్షన్ సవరణ, డిపెండెంట్ ఉద్యోగాల కల్పన, పెండింగ్ ప్రమోషన్ల మంజూరు వంటి అంశాలపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులకు 250 గజాల ఇంటి స్థలం ఇవ్వాలని, తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆ హామీని అమలు చేస్తామని తెలిపారు. సింగరేణిలో అవినీతి, కుంభకోణాల వల్ల సంస్థకు నష్టం జరుగుతోందని ఆరోపించిన కవిత, డీజిల్ కుంభకోణం, లిథియం అయాన్ బ్యాటరీ ప్రాజెక్టు ఒప్పందాలపై విచారణ జరిపించాలని కోరారు. కాంట్రాక్ట్ కార్మికులకు సమాన వేతనాలు చెల్లించాలని, భూములు కోల్పోయిన కుటుంబాలకు న్యాయం చేయాలని అన్నారు. ఈ సందర్భంగా మంచిర్యాల ఎమ్మెల్యేపై విమర్శలు గుప్పించిన ఆమె, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, గుండాగిరి రాజకీయాలు మానుకోవాలని సూచించారు. తెలంగాణ కోసం పోరాడి రాష్ట్రాన్ని సాధించుకున్న ప్రజలు ఎలాంటి బెదిరింపులకు భయపడరని అన్నారు. మంచిర్యాల జిల్లా ప్రజల ప్రేమాభిమానాలతో తెలంగాణ రక్షణ సేనను బలోపేతం చేసి, జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో పార్టీ జెండా ఎగురవేస్తామని కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్, మాజీ మంత్రి బోడ జనార్ధన్, సాజన్, వెంకట్, ఉదారి చంద్రమోహన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




విద్యార్థి తల్లిని హనుమాన్ సన్మానిస్తున్న ఎంఈఓ, సర్పంచ్, ఉపాధ్యాయులు

## ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య

### - తాండూర్ ఎంఈఓ దుర్గం శ్రీనివాస్

**తాండూర్, జూన్ 15, ప్రభాతవార్త :**

ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య బోధన జరుగుతోందని తాండూర్ ఎంఈఓ దుర్గం శ్రీనివాస్ అన్నారు. తాండూర్ జెడ్పిఎస్ఎస్ లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్, మధ్యాహ్న భోజనం ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. విద్యార్థులు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలను చేర్పించాలన్నారు. గత పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్పులు సాధించిన పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులను సన్మానించారు. విద్యార్థులకు నాయకులు, ఉపాధ్యాయులతో కలిసి ఎంఈఓ నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముడిమడుగుల సురేష్, ఉప సర్పంచ్ సత్యనారాయణ, వార్డ్ మెంబర్లు పెట్టెం విష్ణు కళ్యాణ్, చరణ్, నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నూతన విద్యా సంవత్సరంలో

# ఉన్నత లక్ష్యాలు సాధించాలి

### - మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య

**జైపూర్, జూన్ 15, ప్రభాతవార్త**

నూతన విద్యా సంవత్సరంలో ఉన్నత లక్ష్యాలు సాధించాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. సోమవారం 2026-27 విద్యా సంవత్సరం తొలిరోజు సందర్భంగా జిల్లాలోని జైపూర్ మండలం ఇందారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ముందుగా విద్యార్థులకు నూతన విద్యా సంవత్సరం శుభాకాంక్షలు తెలుపుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. విద్యను జీవితంలో అత్యంత విలువైన ఆస్తిగా భావించి కష్టపడి చదివి ఎంచుకున్న లక్ష్యాలను సాధించాలని తెలిపారు. పాఠశాలలోని తరగతి గదులు, గ్రంథాలయం, సైన్స్ ప్రయోగశాలలు, కంప్యూటర్ ల్యాబ్, క్రీడా గది తదితర సౌకర్యాలను పరిశీలించి విద్యార్థులకు అందిస్తున్న విద్యా వాతావరణం, మౌలిక వసతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయాన్ని సందర్శించి విద్యార్థులు ప్రతిరోజూ పుస్తక పఠనానికి సమయం కేటాయించాలని, పాఠ్యపుస్తకాలతో పాటు సాధారణ విజ్ఞానం, స్ఫూర్తిదాయక వ్యక్తుల జీవిత చరిత్రలు, సాహిత్య పుస్తకాలు చదవడం ద్వారా జ్ఞానాన్ని విస్తరించుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలలో నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకుని పోటీ ప్రపంచంలో రాణించేందుకు సిద్ధం కావాలని తెలిపారు. అనంతరం ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు అందజేశారు. విద్యా సంవత్సరపు మొదటి రోజు నుంచే క్రమశిక్షణతో చదువుపై దృష్టి సారించాలని, ప్రతి రోజు నేర్చుకునే అలవాటు పెంపొందించుకోవాలని తెలిపారు. విద్యతో పాటు క్రీడలు, సహపాఠ్య కార్యకలాపాలలో పాల్గొని వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మండల విద్యాధికారి, పంచాయతీ కార్యదర్శి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సర్పంచ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## జీవనజ్యోతి బీమా చెక్కు పంపిణీ

**వేమనపల్లి, జూన్ 15, ప్రభాతవార్త**

నీల్వాయి గ్రామానికి చెందిన నెండుగురు రాజమణి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, ఆమె ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజనలో సభ్యురాలిగా ఉండి రూ.436 ప్రీమియం చెల్లించారు. దీంతో పథకం కింద లభించిన రూ.2 లక్షల బీమా చెక్కును నామినీ అయిన ఆమె కుమార్తె అంజలికి తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ శివశంకర్ సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చెన్నూరి సమ్మయ్య, మాజీ జడ్పీటీసీ సంతోష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేనేజర్ శివశంకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలను సద్వినియోగం చేసుకుని కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఎఫ్ఎల్ కౌన్సిలర్లు జి. శ్రీనివాస్ గౌడ్, రమేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.



నామినీకి బీమా చెక్కు అందజేత



ఫ్రీ ప్రైమరీ స్కూల్స్ మంజూరు చేయాలని కలెక్టర్కు వినతిపత్రం ఇచ్చిన బిజెపి, బీజేవైఎం నేతలు

## ఫ్రీ ప్రైమరీ స్కూల్స్ మంజూరు చేయాలి

**తాండూర్, జూన్ 15, ప్రభాతవార్త :**

తాండూర్ మండలానికి ఫ్రీ ప్రైమరీ స్కూల్స్ మంజూరు చేయాలని బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సుధీర్ గౌడ్, బీజేవైఎం నేత ఏముర్ల ప్రదీప్ కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ను బిజెపి,బీజేవైఎం నేతలు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూకేంద్ర నూతన విద్యా విధానంలో భాగంగా మంచిర్యాల జిల్లాకు 72 ఫ్రీ ప్రైమరీ స్కూల్స్ మంజూరయ్యాయన్నారు. తాండూర్ మండలానికి ఒక్కటి కూడా ఫ్రీ ప్రైమరీ స్కూల్స్ మంజూరు చేయలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సంబంధిత అధికారులు స్పందించి మండలానికి ఫ్రీ ప్రైమరీ స్కూల్స్ మంజూరు చేసి విద్యార్థులు న్యాయం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి బిజెవైఎం నాయకులు రవి, శ్రీనివాస్, సతీష్, విజయ్, నరేష్ పాల్గొన్నారు.

# టియువి రాష్ట్ర కార్యవర్గంలో ఇద్దరికీ చోటు

**తాండూర్, జూన్ 15, ప్రభాతవార్త :**





తెలంగాణ ఉద్యమకారుల వేదిక (టియువి) ఉద్యోగ, ఉపాధ్యాయ, యువజన విభాగం రాష్ట్ర కమిటీలలో తాండూర్ మండలానికి చెందిన ఇద్దరి చోటు లభించింది. ఉద్యోగ, ఉపాధ్యాయ రాష్ట్ర అధ్యక్షుడిగా తాండూర్ మండలం బోయపల్లికి చెందిన చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు మాసాడి శ్రీరాములు, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తాండూర్ మండలం మాదారం కు చెందిన టిఆర్ఎస్వి నేత బోడ సతీష్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నరాల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు తోడేటి శంకర్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శ్రీరాములు, సతీష్ మాట్లాడుతూ రాష్ట్రంలోని మళ్లీ విడత తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను గుర్తించి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నిజమైన ఉద్యమకారులకు అమలు అయ్యే వరకు వారికి అండగా ఉండి పోరాడుతామని పేర్కొన్నారు. ఎంతో నమ్మకంతో తమకు బాధ్యత అప్పగించిన రాష్ట్ర, జిల్లా నేతలకు వారు కృతజ్ఞతలు తెలిపారు.


పుస్తకాలను పంపిణీ చేస్తున్న మాజీ సర్పంచ్ ఏలేటి నీలిమ, రవీందర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు

## జడ్పీ హైస్కూల్ పునఃప్రారంభం

### - విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

నేరడిగొండ, జూన్ 15, ప్రభాతవార్త:

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జడ్పీ హైస్కూల్) నూతన విద్యా సంవత్సరం సందర్భంగా సోమవారం పునఃప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి గ్రామ మాజీ సర్పంచ్ ఏలేటి నీలిమ రవీందర్ రెడ్డి హాజరై పాఠశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతనంగా చేరిన విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించడంతో పాటు, పాఠశాల విద్యార్థులందరికీ ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాల విద్య పూర్తి చేసుకున్న విద్యార్థులందరినీ జడ్పీ హైస్కూల్‌లోనే చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మ మాట్లాడుతూ తమ పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్యను బోధిస్తామని, విద్యార్థులంతా ఈ చక్కని అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. గ్రామ విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ (వీడీసీ) అధ్యక్షుడు ఏలేటి రవీందర్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో ఎటువంటి మౌలిక సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే తక్షణమే పరిష్కరిస్తానని, అవసరమైతే ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. వార్డు సభ్యుడు సాబ్లే సంతోష్ సింగ్ మాట్లాడుతూ విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కూడా సమయపాలన పాటించాలని కోరారు. ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో ఈ జడ్పీ హైస్కూల్‌ను వచ్చే ఏడాది నాటికి పబ్లిక్ స్కూల్‌గా ఆధునికీకరించడం జరుగుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోతి గులాబ్ సింగ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మన బడి పరిరక్షణ టీం ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం

### - ప్రభుత్వ బడి పిల్లలకు ఉచిత ఓపీ వైద్యం

భైంసా, జూన్ 15, ప్రభాతవార్త

బడిబాట (మన బడి పండుగ) కార్యక్రమంలో భాగంగా భైంసా పట్టణంలో సోమవారం మన బడి పరిరక్షణ టీం చైర్మన్ సుంకేట మహేష్ బాబు ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీ, బస్టాండ్ తదితర పరిసర ప్రాంతాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. టీం సభ్యులు ఇంటింటికీ తిరుగుతూ తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యతను వివరించారు. ప్రభుత్వ బడుల్లో కల్పిస్తున్న డిజిటల్ తరగతులు, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్, రాగి జావతో కూడిన నాణ్యమైన మధ్యాహ్న భోజన సౌకర్యాలను తల్లిదండ్రులకు వివరించి, తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా సుంకేట మహేష్ బాబు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తాము చేసిన విజ్ఞప్తికి భైంసాలోని సాక్షి మెటర్నిటీ హాస్పిటల్, ఆదిత్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ యాజమాన్యాలు సానుకూలంగా స్పందించాయన్నారు. ప్రభుత్వ బడి పిల్లలందరికీ పూర్తిగా ఉచితంగా ఓపీ వైద్య సేవలు అందిస్తామని ఆయా ఆసుపత్రుల యాజమాన్యాలు హామీ ఇచ్చాయని, ఈ చొరవ అభినందనీయమని పేర్కొంటూ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమంలో మన బడి పరిరక్షణ టీం సభ్యులు రామోజీవార్ గంగప్రసాద్, యోగేష్, పవన్ కుమార్, నవీన్, ఉపాధ్యాయులు, వాలంటీర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న మన బడి పరిరక్షణ టీం చైర్మన్ సుంకెట మహేష్ బాబు, సభ్యులు

## పెంచికల్‌పేట్ మండల కేంద్రం.. ఎదురుచూస్తోంది..!



- ఎంపీడీఓ కార్యాలయ తరలింపుతో ఎల్కపల్లి పాఠశాలపై పరిపాలన భారం
- విద్యాహక్కుకు విఘాతం కల్గిస్తున్న తాత్కాలిక ఏర్పాట్లు
- పెంచికల్‌పేట్‌లో భవనాలున్నా పట్టని అధికారులు తీరు.
- పెంచికల్‌పేట్ మండల కేంద్రానికి ఎంపీడీఓ కార్యాలయాన్ని తరలించాలని ప్రజల ఆవేదన

పెంచికల్‌పేట్, జూన్ 15, ప్రభాతవార్త

కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో నూతనంగా మండలాల ఏర్పాటులో భాగంగా ఏర్పడిన పెంచికల్ పేట్ మండలం పేరుకు మాత్రమే మండల కేంద్రంగా మిగిలిపోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండలం ఏర్పడి దాదాపు పదేళ్లు గడుస్తున్నా పరిపాలన కార్యకలాపాలు ఇప్పటికి ఎల్కపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోనే కొనసాగుతున్నాయి. మండల కేంద్రంగా ప్రకటించిన పెంచికల్ పేట్ వెనుకబడిన గ్రామం కావడం, ప్రభుత్వ భూములు అందుబాటులో లేవనే కారణాలు చూపడంతో పాటు, ఎల్కపల్లి గ్రామంలో రాజకీయ ఆర్థిక ప్రభావం అధికంగా ఉండటంతోనే కార్యాలయాలు అక్కడే కొనసాగుతున్నాయానే ఆరోపణలు ఉన్నాయి.

### తాత్కాలిక భవనలకే పరిమితమైన శాఖలు...

మండలం ఏర్పడిన పది సంవత్సరాలలో ఇప్పటివరకు పోలీస్ స్టేషన్, మండల స్థాయి విద్యావనరుల శాఖలకు మినహా ఇతర ప్రభుత్వ శాఖలకు శాశ్వత భవనాలు నిర్మించలేదు. ఎంపీడీఓ కార్యాలయం గత తొమ్మిదేళ్లుగా



ఎల్కపల్లి ఎస్సీ కమ్యూనిటీ హాల్ లో కొనసాగగా ఆ భవనం శితిలావస్థకు చేరుకోవడంతో 6 నెలల క్రితం ఎంఆర్సీ కార్యాలయానికి తరలించారు. అయితే విద్యాశాఖ అవసరాల దృష్ట్యా ఎంఆర్సీ భవనాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవడంతో ఎంపీడీఓ కార్యాలయానికి మళ్ళీ భవన సమస్య తలెత్తింది. దీంతో ప్రత్యామ్నాయం లేకపోవడంతో ఎంపీడీఓ కార్యాలయాన్ని ఇటీవల ఎల్కపల్లి ప్రాథమిక పాఠశాలలోకి తరలించారు. పాఠశాలలో మూడు గదులు మాత్రమే ఉండగా, ఒక గదిలో అంగన్వాడీ కేంద్రం కొనసాగుతుండగా 25 మంది చిన్నారుల, ఒక టీచర్, ఒకరు ఆయా ఉన్నారు. మిగతా రెండు గదుల్లో 1నుండి 5వ తరగతి వరకు చదువుతున్న 45 మంది విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. ఎంపీడీఓ కార్యాలయానికి ఒక గదిని కేటాయించగా, ఉపాధి హామీ కార్యకలాపాలకు మరో గదిని కేటాయించారూ. ఎంపీడీఓ తో పాటు ఎంపీఓ, ఏపీఓ, 12 మంది కార్యదర్శులు, అసిస్టెంట్లు కంప్యూటర్ ఆపరేటర్లు, విధులు నిర్వహిస్తుండగా, ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు 12 మంది ఉన్నారు. స్థలాభావం, కార్యాలయానికి వచ్చే ప్రజల రద్దీ కారణంగా మిగిలిన ఒకే గదిలో తరగతుల నిర్వహణతో విద్యార్థుల విద్యపై ప్రతికూల ప్రభావం పడుతుందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ తరుణంలో పాఠశాలను సంజీవ్ నగర్ పాఠశాలకి తరలించేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నట్లుగా సమాచారం.

### మా గ్రామంలో భవనాలు సిద్ధంగా ఉన్నాయి...

ఇదిలా ఉండగా మండల కేంద్రమయిన పెంచికల్ పేట్ లో ప్రత్యామ్నాయంగా ఎంపీడీఓ కార్యాలయం నిర్వహించేందుకు అవసరమైన రెండు విశాలమైన భవనాలు అందుబాటులో ఉన్నాయని గ్రామ సర్పంచ్ తో పాటు గ్రామం ప్రజలు చెబుతున్నారు. టాయిలెట్స్, విద్యుత్ సౌకర్యం, త్రాగునీరు, విశాలమైన గదులు ఉన్నందున ఎలాంటి ఆటంకాలు లేకుండా పరిపాలన వ్యవహారాలు కొనసాగించవచ్చని పేర్కొంటున్నారు. ఒకవైపు మండల కేంద్రానికి పరిపాలనా గుర్తింపు దక్కకపోవడం, మరోవైపు చిన్నారుల చదువుకు అంతరాయం కలిగే పరిస్థితులు నెలకొనడంతో ఈ అంశం ఇప్పుడు పెంచికల్ పేట్ ప్రజల్లో, ఎల్కపల్లి విద్యార్థుల తల్లిదండ్రుల్లో చర్చనియాంశంగా మారింది. పెంచికల్ పేట్ లో అందుబాటులో ఉన్నా భవనాలను పరిశీలించి నిబంధనల ప్రకారం కార్యాలయాన్ని ఇక్కడికి తరలించాలని ప్రజలు కోరుతున్నారు.



## జనం మెచ్చిన నేతకు జన్మదిన శుభాకాంక్షల వెల్లువ

### - రాజురాలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బర్త్‌డే వేడుకలు

నేరడిగొండ, జూన్ 15, ప్రభాతవార్త:

బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ జన్మదిన వేడుకలను మండలంలోని రాజురా గ్రామస్థులు, అభిమానులు ఒక రోజు ముందే అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజల నుంచి ఆయనకు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. వేడుకల్లో భాగంగా అభిమానులు, పార్టీ శ్రేణులు వాంకిడి ఎక్స్ రోడ్డు నుంచి రాజురా గ్రామం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించి ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై ఆయనను గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేక్ కట్ చేసి అభిమానుల మధ్య ముందస్తు జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. ఈ వేడుకను పురస్కరించుకొని గ్రామంలో భారీ అన్నదాన కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేశారు. నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న తమ అభిమాన నాయకుడు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని గ్రామస్థులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, యువకులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఈదురు గాలుల బీభత్సం

### - రేకులు, చెట్లు నేలమట్టం

సారంగాపూర్, జూన్ 15, ప్రభాతవార్త:

మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం రాత్రి వీచిన ఈదురు గాలులు భీకర విధ్వంసం సృష్టించాయి. గాలివాన దెబ్బకు మండల పరిధిలోని బోరిగాం గ్రామంలో ఓ గేదెల డైరీ ఫామ్ పైకప్పు రేకులు పూర్తిగా లేచిపోయి పక్కనే ఉన్న పంట పొలాల్లో పడిపోయాయి. ప్రమాదం జరిగిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో తృటిలో పెద్ద ప్రమాదం తప్పింది. అలాగే జాం, కౌట్ల (బి), స్వర్ణ, వంజర్, సారంగాపూర్, ధని, చించోలి తదితర గ్రామాల్లో భారీ వృక్షాలు, చెట్ల కొమ్మలు విరిగి ప్రధాన రహదారులపై పడ్డాయి. దీంతో ఆయా మార్గాల్లో రవాణా వ్యవస్థకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న స్థానిక మాజీ సర్పంచ్‌లు, గ్రామ యువకులు వెంటనే స్పందించి రోడ్లపై పడిన చెట్లను తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. పలు గ్రామాల్లో నిరుపేదల ఇళ్ల పైకప్పు రేకులు, గుడిసెల కప్పులు గాలికి కొట్టుకుపోయాయి. ఈ గాలివాన బీభత్సం వల్ల తాము తీవ్రంగా నష్టపోయామని, ప్రభుత్వం స్పందించి తమను ఆర్థికంగా ఆదుకోవాలని బాధిత కుటుంబాలు వేడుకుంటున్నాయి.



# రైతుల పక్షాన టిఆర్ఎస్ పోరాటం చేస్తుంది

**- తెలంగాణ రక్షణ సేవ అధినేత్రి కవిత**

**ఆసిఫాబాద్, జూన్ 15, ప్రభాతవార్త**

రైతుల పక్షాన తెలంగాణ రక్షణ సేవ (టిఆర్ఎస్) నిరంతరం పోరాటం చేస్తుందని ఆ పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత వెల్లడించారు. సోమవారం కుమురం భీం జిల్లా పర్యటనలో భాగంగా ఆసిఫాబాద్ పట్టణంలో టిఆర్ఎస్ పార్టీ కార్యాలయంను ప్రారంభించి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కవిత మాట్లాడుతూ ఆసిఫాబాద్ అంటేనే కుమురం భీం పోరాట గడ్డ అని, ఇక్కడ గిరిజన సంస్కృతి ఎరులా పారుతుందన్నారు. జల్ జంగల్ జమీన్ కోసం పోరాటం చేసిన గోండు వీరుడు భీం పోరుగడ్డ కుమురం భీం జిల్లాలో పార్టీ ఆఫీస్ ప్రారంభించినందుకు సంతోషం వ్యక్తం చేశారు. వ్యవసాయం మీదనే ఆధారపడే ఇక్కడి గిరిజనులకు ప్రభుత్వంకొత్తగా యూరియా అప్ ను ప్రవేశపెట్టి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ యూరియా అప్ ను వెంటనే రద్దు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటకు కనీస మద్దతు ధర కల్పించి ప్రతీ గింజను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.



అదేవిధంగా రైతు డిస్కమ్ పేరుతో కొత్తగా ప్రవేశపెట్టిన పథకంతో రైతులకు ఎటువంటి లాభం లేదని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నకిలీ విత్తనాలు అమ్మిన వారిపై కఠినంగా వ్యవహరించి పిడి యాక్ట్ నమోదు చేయాలని హెచ్చరించారు. పోడు పేరుతో రైతులను ఇబ్బంది పెట్టొద్దని, వారికీ రక్షణ కల్పించాలని, గిరిజన కార్పొరేషన్లో ఉద్యోగ ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు. గిరిజన సమస్యలు తీర్చే కేంద్రంగా కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాను తయారు చేయాలని, ఏజెన్సీ ప్రాంతాల్లో 1970 కంటే ముందు ఉన్న ప్రదేశాల్లో గిరిజనేతురులు ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యకు పరిష్కారం చూపాలని జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులను కోరారు. అంతకుముందు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్, కుమురం భీం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వినోద్, సీనియర్ నాయకులు బోడ జనార్ధన్, సబితా, హెచ్ఎంఎస్ నాయకుడు రియాజ్, నాయకులు అశోక్, రాంప్రసాద్, సాయి కుమార్, తిరుపతి, మోసిన్, మనోహర్, శ్యామ్ రావ్ తదితరులు పాల్గొన్నారు.

# కమానలో మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాల ఆవిష్కరణ

**- మాలీలకు ఇచ్చిన ఎస్టీ రిజర్వేషన్ హామీని వెంటనే అమలు చేయాలి - హామీలు నెరవేర్చకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు తీవ్రతరం చేస్తాం**

**- మాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లేండుగురే శ్యాంరావు**

**వాంకిడి, జూన్ 15, ప్రభాతవార్త :**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం కమాన గ్రామంలో మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లేండుగురే శ్యాంరావు ముఖ్య అతిథిగా హాజరై విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాలి కులస్తులకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన ఎస్టీ రిజర్వేషన్ హామీని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనేతర మాలీలకు పోడు భూములపై రైతుబంధు పథకం వర్తింపజేసి వారి ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. మాలి కులస్తుల ఓట్లతో ఎమ్మెల్యేలు, ఎంపీలుగా గెలిచిన ప్రజాప్రతినిధులు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించి ఇప్పుడు మాలి కులస్తుల పట్ల కపట ప్రేమ చూపిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో చేసిన వాగ్దానాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మాలి కులస్తులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే రానున్న రోజుల్లో ప్రజాప్రతినిధులను మాలి కులస్తుల గ్రామాల్లో తిరగనివ్వబోమని హెచ్చరించారు. అవసరమైతే మాలి సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు, ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించి ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొస్తామని తెలిపారు. మాలి కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చేంత వరకు ఉద్యమాలు కొనసాగుతాయని, తమ హక్కుల సాధన కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాలి సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు, యువకులు, మహిళలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# సైబర్ నేరాలు, సోషల్ మీడియా పట్ల అప్రమత్తంగా ఉండాలి

**- 40 బైకులు సీజ్, జరిమానా - 30 మద్యం బాటిళ్ళు స్వాధీనం - తాండూర్ సీఐ దేవయ్య**

**తాండూర్, జూన్ 15 ప్రభాతవార్త :**

సైబర్ నేరాలు సోషల్ మీడియా పట్ల అందరు అప్రమత్తంగా ఉండాలని తాండూర్ సీఐ దేవయ్య అన్నారు. రేచిని గ్రామంలో సోమవారం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని పోలీసులు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ సోషల్ మీడియాలో వచ్చే తెలియని లింకులు ఓపెన్ చేయకూడదని, ఓటీపీలు, బ్యాంకు వివరాలను ఎవరితోనూ పంచుకోకూడదని సూచించారు. వాహన చోదకులు హెల్మెట్ ధరించాలని, సీట్ బెల్ట్ పెట్టుకోవాలని, మద్యం సేవించి వాహనం నడపకూడదని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనకై ప్రతి ఒక్కరు పోలీసులకు సహకరించాలని కోరారు. అనుమానాస్పద వ్యక్తులు సంచరించిన, అసాంఘిక కార్యకలాపాల గురించి తెలిస్తే పోలీసులకు వెంటనే తెలియజేయాలని కోరారు. రైతులు నకిలీ విత్తనాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, ధృవీకరించిన విక్రేతల వద్ద నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. బాల్య వివాహాలు, వరకట్నం వంటి సామాజిక దుష్ప్రవర్తనలను నిరోధించాలని పిలుపు నిచ్చారు. గ్రామాల్లో స్వీయరక్షణ, నేరాల నియంత్రణకు సీసీటీవీ కెమెరాల ఏర్పాటు ఎంతో అవసరమని తెలిపారు. కుటుంబ కలహాలు, మానసిక ఒత్తిడి ఆత్మహత్యకు పరిష్కారం కాదన్నారు. అంతకుముందు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన 40 బైకులను స్వాధీనం చేసుకొని జరిమానా విధించారు. అదేవిధంగా గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులను తనిఖీ చేసి 30 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో తాండూర్, భీమిని ఎస్సైలు ప్రసాద్, కోటేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.





ప్రొసీడింగ్ కాపీలను కాంగ్రెస్ నాయకులకు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే జీ.విఠల్ రెడ్డి

# రూ.60 లక్షల సీసీ రోడ్లు, డ్రైనేజీల ప్రొసీడింగ్ కాపీలు అందజేసిన మాజీ ఎమ్మెల్యే

**భైంసా, జూన్ 15, ప్రభాతవార్త**

లోకేశ్వరం మండలంలోని పలు గ్రామాల్లో సుమారు రూ.60 లక్షలకు పైగా వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్లు, మురుగు కాలువల (డ్రైనేజీ) పనులకు సంబంధించిన ప్రొసీడింగ్ కాపీలను ముధోల్ మాజీ ఎమ్మెల్యే జీ.విఠల్ రెడ్డి అందజేశారు. భైంసా పట్టణ కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ఈ కాపీలను ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులకు అప్పగించారు. మండల పరిధిలోని గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు భారీగా నిధులు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావుకు, ప్రత్యేక చొరవ తీసుకున్న మాజీ ఎమ్మెల్యే జీ.విఠల్ రెడ్డికి లోకేశ్వరం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామస్థుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిధులతో ఆయా గ్రామాల్లో ప్రధాన సమస్యలు పరిష్కారమవుతాయని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాజుర మాజీ సర్పంచ్ ముత్తగౌడ్, మాజీ ఎంపీటీసీ సాయిరెడ్డి, కనకాపూర్ మాజీ సర్పంచ్ నరేష్, నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి రాజారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు గంగయ్య, చిన్నయ్య, నర్సా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో

# మౌలిక వసతులు కల్పించాలి

**- బీఆర్వీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు సోయబ్**

**నిర్మల్, జూన్ 15, ప్రభాతవార్త:**

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని బహుజన రాష్ట్రీయ విద్యార్థి సంఘం (బీఆర్వీఎస్) జిల్లా ఉపాధ్యక్షుడు సోయబ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోయబ్ మాట్లాడుతూ.. నేటికీ అనేక ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, నాణ్యమైన తరగతి గదులు, బెంచీలు వంటి కనీస వసతులు లేకపోవడం ఆవేదన కలిగిస్తోందన్నారు. ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక నిధులు కేటాయించి అన్ని పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. మౌలిక వసతులతో పాటు సరిపడా బోధనా సిబ్బంది లేకపోవడంతో పేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ పోస్టులను త్వరితగతిన భర్తీ చేసి ప్రభుత్వ విద్యపై ప్రజల్లో నమ్మకం పెంచాలని కోరారు. మరోవైపు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ఇష్టానుసారం ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులను ఆర్థికంగా దోచుకుంటున్నాయని మండిపడ్డారు. విద్యా హక్కు చట్టాన్ని తుంగలో తొక్కి, వ్యాపార ధోరణితో నడుస్తున్న కార్పొరేట్ సంస్థలపై కఠినమైన ఫీజు నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పలు విద్యార్థి సంఘాల నాయకులు, విద్యావేత్తలు పాల్గొని ప్రభుత్వ విద్య పరిరక్షణకు కలిసికట్టుగా పోరాడుతామని స్పష్టం చేశారు.



# ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించే దిశగా చర్యలు

**- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



ఇళ్ల దరఖాస్తుదారుల నివాసాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న ఎంపీడీవో లక్ష్మీకాంత్

## ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఎంపీడీవో

**సారంగాపూర్, జూన్ 15, ప్రభాతవార్త:**

మండలంలోని కౌట్ల (బి) గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల అర్హుల ఎంపిక సర్వే సోమవారం కొనసాగింది. మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) లక్ష్మీకాంత్ క్షేత్రస్థాయిలో పర్యటించి దరఖాస్తులను స్వయంగా పరిశీలించారు.ప్రభుత్వం విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుండటంతో, గతంలో ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను అధికారులు సరిచూస్తున్నారు. దరఖాస్తుదారులు ప్రస్తుతం నివసిస్తున్న ఇళ్ల పరిస్థితులు ఎలా ఉన్నాయి, వారు నిజంగానే అర్హులా కాదా అనే అంశాలను ఎంపీడీవో నిశితంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో లక్ష్మీకాంత్ మాట్లాడుతూ.. ఎలాంటి పక్షపాతం లేకుండా, సొంత ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకే మొదటి ప్రాధాన్యత ఇస్తూ అర్హులను ఎంపిక చేస్తామన్నారు. పూర్తి పారదర్శకంగా ఈ సర్వే ప్రక్రియ జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ నాగార్జున, మాజీ ఉప సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఈసారపు శివరత్నం, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

## సైబర్ నేరాలపై ప్రజల్లో చైతన్యం పెంచేందుకు వినూత్న అవగాహన కార్యక్రమం

**మంచిర్యాల, జూన్ 15, ప్రభాతవార్త**

రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాల నేపథ్యంలో ప్రజల్లో సైబర్ భద్రతపై అవగాహన పెంపొందించేందుకు భారతీయ స్టేట్ బ్యాంకు స్థానిక ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో వినూత్న అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శనివారం ఉదయం హైటెక్ సిటీ నడకదారి, గద్దెరగడి గ్రీన్ సిటీ పార్కుల్లో ప్రజలకు సైబర్ భద్రత, ఆన్‌లైన్ మోసాల నివారణ, వ్యక్తిగత బ్యాంకు ఖాతాల సమాచారం రక్షణ, అపరిచితుల నుంచి వచ్చే మోసపూరిత సందేశాలు మరియు ఫోన్ కాల్స్ పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు.మంచిర్యాల ప్రాంతీయ కార్యాలయ ప్రాంతీయ అధికారి రితేష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు కార్యాలయ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు సైబర్ నేరాల బారిన పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.ఈ సందర్భంగా పాల్గొన్న ప్రజలు మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రజల్లో ఇంకా విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని, ఇలాంటి కార్యక్రమాలను తరచూ నిర్వహించడం ద్వారా అపోహలు తొలగి ప్రజలు మరింత అప్రమత్తంగా ఉంటారని అభిప్రాయపడ్డారు. ప్రజలను సైబర్ మోసాల నుంచి రక్షించాలనే లక్ష్యంతో నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమానికి స్థానికుల నుంచి మంచి స్పందన లభించింది.

**నస్పూర్, జూన్ 15, ప్రభాతవార్త**

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశం మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్ లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. చెన్నూర్ మండలం ఒతుకులపల్లి గ్రామానికి చెందిన కావేరి శోభ తన పేరు ఇందిరమ్మ మొదటి జాబితాలో వచ్చిందని, ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణానికి చెందిన సెగ్గెం ప్రసాద్ ఎస్.సి. కులానికి చెందిన నిరుపేద అయిన తనకు జీవనాధారంగా ఆటో, రెండు పడక గదుల ఇల్లు అందజేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. తాండూరు మండలం అచలాపూర్ గ్రామానికి చెందిన కట్ల పోసక్క, కట్ల పోచంలు గ్రామ శివారులో చేపట్టిన అక్రమ కల్వర్టు నిర్మాణంలో తమ భూమి ఆక్రమణ జరుగుతుందని, ఈ విషయమై తమకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని భగత్‌నగర్‌కు చెందిన సత్యనారాయణ రావు తనకు జిల్లాలోని లక్షెట్టిపేట మండలం మోదెల గ్రామంలో గల భూమి గోదావరి నీటిలో మునిగిందని, ఈ విషయమై సమగ్ర విచారణ జరిపి నష్టపరిహారం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జిల్లాలోని దేవాపూర్ కు చెందిన కాంపెలి వెంకటేశం తన కుమారుడికి లక్షెట్టిపేట మండల కేంద్రంలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహంలో సీటు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జైపూర్ మండలం ఇందారం గ్రామానికి చెందిన కళ్యాణి తనకు గృహజ్యోతి, గ్యాస్



రాయితీ పథకాలు వర్తింపచేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అంతకుముందు నస్పూర్ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి భోజనశాల, అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యా సంవత్సరం ప్రారంభమైనందున విద్యార్థులకు నోటు పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు అందించాలని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్న భోజన పథకాలను పకడ్బందీగా అమలు చేయాలని, మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## హిరాపూర్ ఎంపీపీఎస్ పాఠశాల ప్రారంభం

**ఆసిఫాబాద్ టౌన్, జూన్ 15, ప్రభాతవార్త :**

ఆసిఫాబాద్ మండలంలోని ప్రభుత్వ ఎంపీపీఎస్ పాఠశాలను డిఈఓ సచిదానందచారి ప్రారంభించారు. సోమవారం ఆసిఫాబాద్ మున్సిపల్ పరిధిలోని హీరాపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను విద్యార్థులు లేరనే కారణంతో ఏడేళ్ల కిందట మూసేశారు. ఈ నేపథ్యంలో 9వ వార్డు కౌన్సిలర్ సాలం బిన్ అహ్మద్ విద్యాశాఖ అధికారులతో మాట్లాడి పాఠశాల ఆవరణ శుభ్రపరిచి తన సొంత ఖర్చులతో మరమ్మతులు చేయించారు. ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ ఆకాష్, వైస్ చైర్ పర్సన్ ఎండి అహ్మద్, గ్రంథాలయ చైర్మన్ అనిల్, సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్, కౌన్సిలర్లు సాలం బిన్ అహ్మద్, చిలువేరు వెంకటేశ్వర్లతో కలిసి డి ఈ ఓ పాఠశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డి ఈ ఓ మాట్లాడుతూ విద్యార్థులకు స్వాగతం పలికి విద్య యొక్క ప్రాముఖ్యతను వివరించారు. పాఠశాల పరిసరాలను పరిశీలించి విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. అదేవిధంగా ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని, ప్రతి విద్యార్థి నాణ్యమైన విద్యను పొందేలా కృషి చేయాలని పేర్కొన్నారు. అనంతరం గ్రామస్తులు ప్రజాప్రతినిధులకు, అధికారులకు శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సుభాష్, నాయకులు, ఉపాధ్యాయులు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అహమద్ బిన్ అబ్దుల్లా, నాయకులు సయ్యద్ నిసార్, అమర్ బిన్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.





## విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ

**- కాగజ్‌నగర్ బాలికల, బాలుర ఉన్నత పాఠశాలల్లో కార్యక్రమం**
**- నూతన విద్యార్థినికి స్వాగతం పలికిన ఎంఈఓ వాసాల ప్రభాకర్**
**- పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన ఉపాధ్యాయులకు అభినందనలు**

**కాగజ్‌నగర్ రూరల్, జూన్ 15, ప్రభాతవార్త :**

బడిబాట కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలికల) సర్‌సిల్క్‌తో పాటు కాగజ్‌నగర్ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాగజ్‌నగర్ మండల విద్యాధికారి (ఎంఈఓ) వాసాల ప్రభాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆరవ తరగతిలో నూతనంగా చేరిన జోర్రిగల వైభవ శ్రీకి ప్రత్యేకంగా స్వాగతం పలికి పాఠశాలలోకి ఆహ్వానించి పాఠ్యపుస్తకాలు అందజేశారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న ఉచిత సదుపాయాలను సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో విద్యాభ్యాసం కొనసాగించాలని సూచించారు. విద్యే భవిష్యత్తుకు బలమైన పునాది అని పేర్కొంటూ ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అదేవిధంగా ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను అభినందించారు. వారి కృషి వల్ల ప్రభుత్వ పాఠశాలలకు మంచి గుర్తింపు లభిస్తోందని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాక శ్రీలత, ఆత్రం ప్రమీల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్య పుస్తకాల పంపిణీ

**వేమనపల్లి, జూన్ 15, ప్రభాతవార్త**

వేమనపల్లి మండలం నీల్వాయి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో సోమవారం ఉచిత పాఠ్య పుస్తకాలను మాజీ జడ్పీటీసీ ఆర్. సంతోష్ కుమార్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చెన్నూరి సమ్మయ్య, ప్రధానోపాధ్యాయులు గిరిధర్ రెడ్డి, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ మయూరి పాల్గొన్నారు. అనంతరం ఇంటర్, పదో తరగతుల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులను శాలువాలతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

